క్లుప్తంగా

అన్నదానం



కోట: స్థానిక సోమేశ్వరాలయంలో బుధవారం ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులు ముందుగా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగ్గురు వెల్ఫేర్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

దక్కిలి: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం లింగసముద్రం, దక్కిలి, నాగవోలు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ మూడు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆగస్టు 21 నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయలేదన్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ముగ్గురికి ఈ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు రూరల్: వీధి వ్యాపారులు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో డిజిటల్ ఫైనాన్స్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పథకం కింద బ్యాంకులు మొదటి విడతలో రూ.10 వేల రుణం ఇస్తాయన్నారు. వాటిని సక్రమంగా చెల్లిస్తే రెండో విడతలో రూ.20 వేలు ఇస్తారని పేర్కొన్నారు. ఏపీజీబీ జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, సీవో చందన పాల్గొన్నారు.

సంఘాలపై అవగాహన

సైదాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు సహకార సంఘాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం సైదాపురంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. అనంతరం సహకార సంఘాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

నత్తనడకన సర్వీస్ రోడ్డు పనులు

'మా గ్రామానికి ఆనుకుని ఆరులేన్ల జాతీయ రహదారి వెళుతోంది. మా గ్రామం అభివృద్ధిలో పరుగులు పెడుతుంది' అని పలు గ్రామాల ప్రజలు భావించారు. వారి కల కల్లగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేని తనంతో వారికి తిప్పలు తప్పడం లేదు. సర్వీసు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో గ్రామీణులు రోడ్డుపైకి రావాలంటే కిలోమీటరు నడవాల్సి వస్తోంది. పనులు నత్తను తలపిస్తున్నాయని, ఎప్పుడు పనులు పూర్తవుతాయోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రోడ్డు మీదకు రావాలంటే కిలోమీటరు నడవాల్సిందే
- ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ఎన్‌హెచ్‌ఏ అధికారులు



చిల్లకూరు వద్ద అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్డు

పెళ్లకూరు: రేణిగుంట–నాయుడుపేట పట్టణాలను కలుపుతూ చేపట్టిన 71వ నంబరు జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరిస్తూ రూ.2,200 కోట్లతో సుమారు 57 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. పనులను మెగా ఇన్‌ఫ్రా కంపెనీ చేపట్టింది. పెళ్లకూరు మండలంలో తాళ్వాయిపాడు, దిగువచావలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి క్రాస్ రోడ్డు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టారు. గ్రామీణ ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. సర్వీసు రోడ్డు పనులు మాత్రం 20 శాతం కూడా పూర్తి కాలేదు. జాతీయ రహదారికి ఇరువైపులా ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు సైతం హైవే గుండా వెళుతున్నాయి. దాంతో పల్లె ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు, ఆటోల కోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జికి 500 మీటర్ల దూరంలో ఉన్న స్టాపింగ్ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. సుమారు కిలోమీటరు దూరం నడవాల్సి వస్తోంది. అత్యవసర సమయంలోనూ, రాత్రి వేళల్లోనూ తిప్పలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. బాలింతైనా, గర్భిణి అయినా, వృద్ధులైనా, దివ్యాంగులైనా, స్కూలు పిల్లలైనా రోడ్డు మీదకు రావాలంటే గుంతల రోడ్డులో కంకర రాళ్లపై అవస్థలు పడుతూ నడవాల్సి వస్తోంది.

ఆరు నెలలుగా ముందుకు సాగని పనులు

తాళ్వాయిపాడు, దిగువచావలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ సుమారు 500 మందికి పైగా పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళుతూ ఉంటారు. అలాగే వివిధ పనులు చేసుకునే కూలీలు, ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బందికి కాలి నడక తప్పడం లేదు. మండల కేంద్రమైన పెళ్లకూరు వద్ద ఆరు నెలల క్రితం సర్వీసు రోడ్డుకు అడ్డంగా గుంతలు తీశారు. పనులు పూర్తి చేయకపోవడంతో అటుగా వెళ్లే వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సు చార్జీలకు ధీటుగా వసూలు చేస్తున్న ఆటోవాలా కూడా హైవేలోనే వెళుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో సర్వీసు రోడ్లన్నీ బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు స్పందించి సర్వీసు రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





పెళ్లకూరు వద్ద సర్వీసు రోడ్డుకు అడ్డంగా తీసిన గుంతలు, పెళ్లకూరు టెంకాయతోపు వద్ద అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్డు

కండలేరులో 52.105 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 52.105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1800 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా ప్లాస్టిక్ బుట్టలు

చిల్లకూరు: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను సేకరించేందుకు గతంలో ఇంటికి రెండు ప్లాస్టిక్ బుట్టలు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల ముందు సుమారు వెయ్యి బుట్టలు వచ్చాయి. ప్రస్తుతం చెత్త సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేస్తున్న క్రమంలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ బుట్టలు అవసరం ఏర్పడింది. వాటిని గ్రామాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రాపూరు: రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో సునంద, ఓఎస్‌డీ షహజాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యాలయం నుంచి కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



ఎంపీ మిథున్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నేతలు

పెళ్లకూరు: కార్యకర్తలకు అండగా ఉండి వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నెల్లూరులో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. వారి దృష్టిని మరల్చేందుకు సోషల్ మీడియా యాక్టివిస్టులను, పార్టీలో బలమైన నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, దాడులను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, మానుగుంట మహేందర్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, పి.అనీల్‌కుమార్‌యాదవ్, పార్టీ సమన్వయకర్తలు ఆనం విజయకుమార్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ కార్యదర్శి ఖలీల్‌అహ్మద్ పాల్గొన్నారు.

పంచాయతీ దుకాణాలకు పవర్ కట్

కోట: అధికారులు ఇచ్చిన గడువు ముగియడంతో కోట బజారులో ఉన్న పంచాయతీ దుకాణాలకు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. బజారులో 21 పంచాయతీ దుకాణాలు ఉన్నాయి. వాటిలో వ్యాపారాలు చేసుకుంటున్న వారు అద్దె చెల్లించలేదు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ విచారణ జరిపారు. దుకాణానికి నెలకు రూ.18,500ల అద్దె చెల్లించాలని, లేనిపక్షంలో ఖాళీ చేయాలని అధికారులు వ్యాపారులకు సూచించారు. అధికారులు ఇచ్చిన గడువు ముగిసినా అద్దె చెల్లించకపోవడంతో దుకాణాలకు కరెంట్ కట్ చేశారు. అద్దె చెల్లించని పక్షంలో టెండర్ల ద్వారా కొత్త వారికి అప్పగిస్తామన్నారు.

జాగ్రత్తలతో నష్ట నివారణ

సూళ్లూరుపేట రూరల్: వరద సమయాల్లో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలు జరగకుండా చూడవచ్చని విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌ఐ సుమన్‌కుమార్ తెలిపారు. సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వరదల సందర్భంగా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అధికారులకు అవగాహన కల్పించారు. కోటపోలూరు సమర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మ్యాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో ప్రమీలారాణి, సీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సైదాపురం : నరసింహులునాయుడుకు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి



రాపూరు : రామచంద్రయ్యకు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి, మేరిగ మురళీధర్

సైదాపురం/రాపూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన బుధవారం సైదాపురంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. ఎవరినీ వదిలిపెట్టమన్నారు. అనంతరం ఆయన పాలూరు చేరుకున్నారు. ఇటీవల మృతిచెందిన చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహులునాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య నాగమ్మను పరామర్శించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి రాపూరు వెళ్లారు. అక్కడ సోమవారం రాత్రి మృతి చెందిన రాపూరు- 2 ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రేవూరు రామచంద్రయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైదాపురం నేతలు మన్నారపు రవికుమార్, జి.శ్రీనివాసులు రాజు, మోహన్‌రావు, శివకుమార్, రామచంద్రరాజు, రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరమణయ్య, నాగరాజు, శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ ఏకోలు వెంకటయ్య, రాపూరు నేతలు దందోలు నారాయణరెడ్డి, డాక్టర్ ఖాదర్ బాషా, పెంచలరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, డీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వాకాడు/రాపూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్(ఏపీపీటీడీ) ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం వాకాడు, రాపూరు ఆర్టీసీ డిపోల గేట్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, టీఏలు, బిల్లులు, ఇతర అలవెన్స్‌లు ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. అలాగే 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులపై చీటికి మాటికి కేసులు రాసే పద్ధతి మానుకోవాలి. పాత బస్సులతో ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారని, కొత్త బస్సులు కొనాలన్నారు. వాకాడు, రాపూరు ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో సెక్రటరీలు వజీర్‌బాష, మురళీ, జాయింట్ సెక్రటరీ బలరామయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

చిల్లకూరు: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కడవేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. పొదుపు సంఘాల సభ్యులు పొలం కౌలుకు తీసుకుని పలు రకాల కూరగాయలు సాగు చేసేలా అవగాహన కల్పించారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి భూమిని కౌలుకు తీసుకుంటే కిచెన్ గార్డెన్, ఏటీఎం మోడల్ (ఎనీటైం మనీ) పంటలు సాగు చేయడం, వాటికి అవసరమైన ఘన జీవామృతం తయారు చేయడం తదితరాలను వివరించారు. కార్యక్రమంలో రాయస కన్సల్టెంట్ జమున, టీఎల్ భాగ్యలక్ష్మీ, గీతారాణి, వీరరాఘవయ్య, పూర్ణిమ, శ్రీనివాసులురెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

రాపూరు/కలువాయి/సూళ్లూరుపేట/వెంకటగిరి రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని పలువురు వక్తలు తెలిపారు. రాపూరు, కలువాయి, సూళ్లూరుపేట, వెంటగిరి మండలాల్లో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ హరినాథ్, లైబ్రేరియన్ నాగరాజు, కలువాయి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్బాస్ అలీ, లైబ్రేరియన్ పి.సుధాకర్, సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ, గ్రంథాలయ అధికారి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, గ్రంథాలయ ఇన్‌చార్జి సీహెచ్ సుబ్రమణ్యం, కె.శరత్‌బాబు, వెంకటగిరి ఎంఈవో వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారి అంజయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: గూడూరు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు, మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. గూడూరులో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై ట్రాఫిక్ పద్మవ్యూహం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం గూడూరులోని ఆస్పత్రి రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ సెంటర్, సంగం థియేటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు, రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసే వారితో మాట్లాడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేలా చూశారు. ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కోట: మండలంలోని పుచ్చలపల్లిలో బుధవారం మద్యం విక్రేతను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

సస్య రక్షణతో అధిక దిగుబడి

సైదాపురం: నిమ్మ తోటలు సాగు చేసే రైతులు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని పొదలకూరు ఉద్యాన శాఖ అధికారి ఆనంద్ తెలిపారు. ఆయన బుధవారం లింగనపాళెం, పోతేగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ 2024–25లో సైదాపురం మండలంలో 21 మంది రైతులకు ప్యాక్ హౌస్‌లు మంజూరు చేశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏవో హైమావతి మాట్లాడుతూ ప్రతి రైతూ తాము సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



రంగయ్య (ఫైల్)

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం మల్లెమాల గ్రామంలో మంగళవారం రాత్రి పాము కాటువేయడంతో వ్యక్తి మృతి చెందాడు. మల్లెమాలకు చెందిన కందాటి రంగయ్య(53) మంగళవారం రాత్రి వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. దారిలో పాము కాటువేసింది. ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వారు అతన్ని గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగానే మృతి చెందాడు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం మంగళంపాడు, ఉచ్చూరు, వెంగళాపురం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడపాలని బుధవారం పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు లోకేష్ కోరారు. ఆయన బుధవారం ఆర్టీసీ డీఎం మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో బస్సులు నడిచేవని, తర్వాత నిలిపేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డీఎం మాట్లాడుతూ పరిశీలించి బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మా కాలనీలో మద్యం షాపు పెట్టొద్దు



మద్యం షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

సైదాపురం: మా కాలనీలో మద్యం షాపు పెట్టొద్దని మండలంలోని కలిచేడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు తెలిపారు. కలిచేడు చెరువు సమీపంలోని ఒక రైతు పొలంలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీ కాలనీ మహిళలు అక్కడికి చేరుకున్నారు. షాపు ఏర్పాటును అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో మద్యం షాపు పెడితే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

భూములు చూపించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు

పెళ్లకూరు: ప్రభుత్వం ఇచ్చిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంతోపాటు భూములకు హద్దులు చూపించాలని అర్ధమాలకు చెందిన పలువురు నిరుపేదలు కోరారు. వారు బుధవారం తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని 16 మంది నిరుపేదలకు 1987లో ప్రభుత్వం సర్వే నంబరు 2లో సుమారు 16 ఎకరాల భూములను మంజూరు చేసిందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా పేర్లు నమోదు చేశారని తెలిపారు. ఆయా భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంతోపాటు హద్దులు చూపాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆగిన అదనపు తరగతి గది నిర్మాణం

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇక్కడ 50 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. గదులు లేకపోవడంతో వరండాలో కూర్చోపెడుతున్నారు. గత ప్రభుత్వం గది నిర్మాణానికి రూ.8 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం గోడలు పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో పనులు ఆపేశారు.